ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శనివారం 16 ఆగస్టు 2025

మునిసిపల్ కార్యాలయంలో
చిందులు..
● స్వాతంత్ర్య దిన వేడుకల అనంతరం స్టెప్పులు
● సోషల్ మీడియాలో వైరల్
8



స్వాతంత్ర్య దిన వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి దామోదర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి పారితోషికం అందజేస్తున్న మంత్రి దామోదర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

స్వాతంత్ర్య దిన వేడుకల్లో నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నాడు నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి దామోదర్‌తో పాటు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మంత్రితో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో అలరించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి ప్రభుత్వం నుంచి మంజూరైన పారితోషం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఐదు సీజన్లలో రూ.29.27కోట్ల బకాయి

● పెండింగ్‌లో ధాన్యం కమిషన్
● ఆర్థిక ఇబ్బందుల్లో సహకార, మహిళా సంఘాలు

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార, మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలులో కమిషన్ అందక ఇబ్బందులు పడుతున్నాయి. గత సీజన్‌కు సంబంధించి జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ రైతులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం 419 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కొనుగోళ్లలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకేపీ మహిళా సంఘాలు క్రియాశీలకంగా పనిచేశాయి. మెప్మా కూడా కొన్నికేంద్రాలను నిర్వహించింది.

వివరాలు ఇలా		
2022-23	యాసంగి	రూ. 3.15 కోట్లు
2023-24	వానాకాలం	రూ. 2.78 కోట్లు
2023-24	యాసంగి	రూ. 2.79 కోట్లు
2024-25	వానాకాలం	రూ. 8.36 కోట్లు
2024-25	యాసంగి	రూ.12.19 కోట్లు

క్వింటాలుకు రూ.32 చొప్పున

ఐదు సీజన్లలో కలిపి 16.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యం కొనుగోలుకు క్వింటాలుకు రూ.32 చొప్పున

మిగతా 8వ పేజీలో



మార్కెట్‌యార్డులో ధాన్యం (ఫైల్)



అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు

● ఆహార భద్రత, సన్నబియ్యం, సొంతింటి కలను నెరవేర్చాం ● నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం
● మహిళా శక్తి పాలసీ ద్వారా రూ. 189 కోట్లతో ఉపాధి కల్పిస్తాం
● రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం సిద్దిపేటలోని పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, పథకాల ప్రగతిపై సుదీర్ఘ సందేశాన్ని వినిపించారు.

- సిద్దిపేట/సిద్దిపేటకల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి)



రేషన్ కార్డు ద్వారా అర్హులైన ప్రజలకు ఆహార భద్రతకు ఒక భరోసా కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి 35,681 నూతన కార్డులను మంజూరు చేసినట్లు చెప్పారు. లక్షా పదివేల మందిని సభ్యులను కార్డుల్లో చేర్చినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 12,633 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 8,777 ఇళ్ల మార్కింగ్, 6,509 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 14.13 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, తద్వారా వారందరికీ రూ.527 కోట్ల లబ్ధి చేకూరినట్లు స్పష్టం చేశారు. 2024లో ప్రారంభమైన పంట రుణమాఫీ పథకం మార్చి 2025 నాటికి నాలుగు దశల్లో జిల్లావ్యాప్తంగా 1,10,934 మంది రైతులకు రూ. 921 రుణమాఫీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో రూ. 5లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. జిల్లాలో 15,096 మంది పేదలకు శస్త్ర చికిత్సలు చేసి రూ. 43.08 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వాలంబనకు మహిళాశక్తి కార్యక్రమం తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం తెలిపారు. మహిళా శక్తి పాలసీలోని 14 కార్యక్రమాల ద్వారా జిల్లాలో 2024- 2025కు గానూ స్వయం సహాయక సభ్యులకు రూ.189 కోట్లతో ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. 2025-26కు గానూ 14,909 సంఘాలకు రూ. 886 కోట్లు బ్యాంకు రుణాలను అందిచాలన్న లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 3,077 స్వయం సహాయక సంఘలకు రూ. 260 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని చెప్పారు.



ఎన్సాన్‌పల్లి రెసిడెన్షియల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



కొండపాక జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



చింతమడక, రాఘవాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల విన్యాసాలు

జాతీయజెండాకు వందనం చేస్తున్న మంత్రి, కలెక్టర్, సీపీ, అధికారులు



ఆకట్టుకున్న ప్రదర్శనలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన నిర్వహించారు. వేడుకల ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. గతంలో డిగ్రీ కళాశాలలో నిర్వహించినపుడు పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యేవారు. కమిషనరేట్ కార్యాలయం పట్టణానికి దూరంగా ఉండటం, భద్రతా కారణాలతో తనిఖీలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు హాజరు కాలేదు. వేడుకలకు హాజరైన వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

కార్యక్రమం జరిగిందిలా..

- ఉదయం 9.30 నిమిషాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.
- గౌరవ వందన స్వీకరణ
- 9.35 నిమిషాలకు జిల్లా ప్రగతిపై మంత్రి ప్రసంగం
- 10.15 నిమిషాలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- 10.45 నిమిషాలకు వివిధ శాఖల శకటాల ప్రదర్శన
- 11.05 నిమిషాలకు స్టాల్స్ సందర్శన
- అనంతరం దివ్యాంగులకు ఆర్థిక పునరావాసం కల్పించడానికి చెక్కుల పంపిణీ
- పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన
- జిల్లాలోని వివిధ శాఖల్లో విశేష కృషి చేసిన 136 మందికి ప్రశంసాపత్రాల అందజేత
- 11.55 నిమిషాలకు వందన సమర్పణ



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి పొన్నం



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్



స్టాల్‌లో వ్యవసాయ పరికరాన్ని పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు



మహాలక్ష్మి పథకానికి సంబంధించిన శకటం (ఆర్టీసీ బస్సు)



వర్షం లేకపోవడంతో స్పీకర్లపైన ఉన్న కవర్లు తొలగిస్తున్న సిబ్బంది



పాలమాకులలో ఎరువుల కోసం క్యూలో ఉన్న రైతులతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

చేతకాకుంటే గద్దె దిగండి

● ఎరువుల కోసం రైతుల ఇబ్బందులు
● మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాన్ని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకుల ప్రాథమిక సహకార సంఘం వద్ద ఎరువుల కోసం క్యూలో నిల్చున్న రైతులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాత విధానాలనే అమలు చేస్తోందని, పోలీస్‌స్టేషన్‌లో ఎరువులు తీసుకునే రోజులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోందని, చేతకాకుంటే గద్దె దిగాలని విమర్శించారు. రైతులకు ఇచ్చే సబ్సిడీలను ఎత్తివేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. దద్దమ్మ రేవంత్‌కు రైతు ప్రభుత్వం అని చెప్పుకునే అర్హత లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి 16 మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు డ్రామాలు ఆపి రైతులకు ఎరువులు అందించేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. నానో యూరియా వాడటం రైతులకు ఆర్థిక భారం అవుతుందని, మళ్లీ పాత రోజులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తెచ్చిన మార్పుతో పదేళ్లలో లేని విధంగా చెప్పులు క్యూలో కనిపిస్తున్నాయన్నారు.

గంగమ్మ తల్లికి పూజ

అక్కెనపల్లి పెద్దవాగు జలకళ సంతరించుకోవడంతో హరీశ్ రావు చెక్ డ్యామ్‌లను సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలు రైతులకు ఉపయోగపడడం సంతోషంగా ఉందన్నారు. పరవళ్లు తొక్కుతున్న వాగుపై పూలు జల్లారు.

చేనేత సమస్యలపై నిలదీస్తా..

సిద్దిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తానని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హమీనిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరా నగర్ పద్మశాలి సంఘం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

బండెనక బండికట్టి..

చేర్యాల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణం మహంకాళి అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. బండెనక కట్టిన ఎడ్లబండ్ల హుంకారాలు, మేకపోతును గావుపట్టిన పోతురాజు వీరంగంతో పాటు డప్పుచప్పుళ్ల దరువుతో హోరెత్తింది. శ్రావణ మాసం చివరివారాన్ని పుస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని మహంకాళి అమ్మవారికి ఘనంగా బండ్ల బోనాల జాతర నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి శాస్త్రోక్తయుక్తంగా విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం రైతులు తమ కాడెడ్లను అలంకరించి వీధులగుండా ఎడ్లబండ్ల ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. మహిళలు బెల్లంపాయసం తయారుచేసి అమ్మవారికి నివేదించారు.



ఎడ్ల బండ్లతో ఆలయానికి చేరుకుంటున్న రైతులు, గ్రామపెద్దలు

చెల్లాపూర్‌లో కొలువైన మీసాల కృష్ణయ్య | ● నేడు కృష్ణాష్టమి
7

గద్వాల అనుకుని గజ్వేల్ చేరిన వృద్ధుడు

● చేరదీసిన పోలీసులు.. కుటుంబసభ్యులకు అప్పగింత

గజ్వేల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : దారితప్పి గజ్వేల్‌కు వచ్చిన వృద్ధుడిని ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది చేరదీశారు. అనంతరం వివరాలు తెలుసుకుని అతని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లా, ధారూరు మండలం రాయలపాడుకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు చిన్న నాగప్ప తన కొడుకుతో కలిసి ఆధార్ కార్డులో మార్పు కోసం బుధవారం అమీర్‌పేటకు వచ్చాడు. ఒరిజినల్ ఆధార్ కార్డు మరిచిపోవడంతో ఆయన కుమారుడు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో తండ్రిని ఉండమని చెప్పి స్వగ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో రైల్వే పోలీసులు అక్కడి నుంచి వెళ్లాలని చెప్పడంతో నాగప్ప రైల్వేస్టేషన్ నుంచి బయటికి వచ్చాడు. తన కుమారుడు రావడానికి ఆలస్యమవుతుందని భావించిన అతను గద్వాలకు వెళ్లాలనే ఉద్దేశంతో కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దారి అడిగాడు. అయితే, గద్వాల అనుకుని గజ్వేల్ వెళ్లే బస్సు ఎక్కించారు. తీరా గురువారం ఉదయం గజ్వేల్ బస్టాండ్‌లో దిగిన తరువాత దారేమీ అర్థం కాలేదు. నాగప్ప గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారం రోడ్డు చెరువు వద్ద నిస్సహాయంగా కూర్చున్నాడు. పెట్రోలింగ్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ జగన్మోహన్ రెడ్డి, కానిస్టేబుల్ సంతోష్ ఆ వృద్ధుడిని చూసి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి భోజనం పెట్టారు. ఆ తర్వాత అతని బంధువులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు గజ్వేల్‌కు వచ్చాక ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ విచారణ జరిపి, వృద్ధుడిని వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. క్లిష్ట సమయంలో అండగా నిలిచిన పోలీసులకు వృద్ధుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



వృద్ధుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న గజ్వేల్ పోలీసులు

చేర్యాల ఎంపీవోపై సస్పెన్షన్ వేటు

చేర్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ఎంపీడీవో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎంపీవో మహబూబ్ అలీపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల చేర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి, ఆ తర్వాత మార్కెట్ యార్డులోని కొత్త భవనాన్ని పరిశీలించారు. ఆ సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఆలస్యంగా హాజరైన మహబూబ్ అలీని ఆమె మందలించారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయకపోవడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మహబూబ్ అలీని సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో కొండపాక ఎంపీవో మల్లికార్జున్‌కు చేర్యాల ఎంపీడీవో ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి కొడుకును చంపిన తల్లి
- తొమ్మిది నెలల క్రితం ఘటన

తూప్రాన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని చేతికి అందివచ్చిన కొడుకును ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసిందో తల్లి. మద్యం తాగించి తాడు, చున్నీతో గొంతు బిగించి చంపేసి.. మృతదేహాన్ని సమీపంలోని హల్దీవాగులో పడేశారు. తొమ్మిది నెలల క్రితం ఈ హత్య జరగగా, తల్లే హత్య చేయడం.. ఎక్కడా మిస్సింగ్ కేసు కూడా నమోదు కాకపోవడం, ఎలాంటి ఆధారాలూ దొరకక కేసు మూసివేసే దశకు చేరుకుంది. చివరికి సాంకేతిక ఆధారాలతో హత్యకు గురైన యువకుడిని గుర్తించి, కేసును ఛేదించారు. తూప్రాన్ డీఎస్పీ జే నరేందర్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, తూప్రాన్ ఎస్సై శివానందంతో కలిసి శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లికి చెందిన మహమ్మద్ రహేనా వివాహం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మక్తామైలారానికి చెందిన జహంగీర్‌తో జరిగింది. వారికి కుమారుడు పుట్టిన అహ్మద్ పాషా అలియాస్ పాషా(25) పుట్టిన ఏడాదికే జహంగీర్ మృతి చెందాడు. దీంతో రహేనా కుమారుడిని తీసుకుని వెంకటాయపల్లికి వచ్చి ఉంటోంది. కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లగా, ఆమెకు మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లికి చెందిన కందాల బిక్షపతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొన్నాళ్లకు రహేనా, కొడుకుతో కలిసి మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు వచ్చి నివాసం ఉంది. కొడుకు పాషాకు వివాహం కాగా, కలహాలతో భార్య నెల రోజుల్లోనే విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లికొడుకులు కలిసి ఉంటున్నారు. అయితే, తన వివాహేతర సంబంధానికి కొడుకు అడ్డుగా ఉన్నాడని రహేనా భావించింది. ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని ప్రియుడితో కలిసి పథకం వేసింది. గతేడాది నవంబర్ 27న కొడుకు, ప్రియుడితో కలిసి తన స్వగ్రామమైన వెంకటాయపల్లికి బయలుదేరింది. తూప్రాన్ పట్టణ పరిధి అంబోతుపల్లి వద్ద ముగ్గురూ కలిసి మద్యం తాగారు. మత్తులో ఉన్న పాషాను తల్లి రహేనా, ఆమె ప్రియుడు బిక్షపతి కలిసి తాడు, చున్నీతో గొంతు బిగించి చంపేశారు. మృతదేహాన్ని సమీపంలోని హల్దీవాగులో పడేశారు. అదే నెల 28న పోలీసులు వాగులో మృతదేహాన్ని గుర్తించి, గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. అయితే, చనిపోయిన యువకుడికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాకపోవడం, తల్లి ప్రియుడితో కలిసి వెళ్లిపోవడంతో కేసులో ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే, సాంకేతిక ఆధారాలతో మృతుడిని గుర్తించిన పోలీసులు ఈ కేసులో తల్లి రహేనా, ఆమె ప్రియుడు కందాల బిక్షపతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మైత్రి డ్రగ్స్‌పై రైతుల ఆగ్రహం

గుమ్మడిదల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని మైత్రి డ్రగ్స్ పరిశ్రమపై రైతులు ధర్నా చేశారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి తమ పంట పొలాల్లోకి చేరి పంటను నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నా పరిశ్రమ యాజమాన్యం, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. రసాయన జలాల వల్ల వరి పంట పూర్తిగా దెబ్బతిందని ఆరోపిస్తూ, బాధిత రైతులు పరిశ్రమ గేటు ఎదుట ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ పరమేశం, ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పీసీబీ అధికారులను పిలిపించి రసాయన జలాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. రైతులకు న్యాయం చేస్తామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.



రసాయన జలాలతో పంట నాశనమైందంటూ న్యాయం చేయాలని పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

పేదల హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడుతా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కంగ్టి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాలు, పెన్షన్‌దారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పేదల పక్షాన ఎంతవరకైనా పోరాటం చేసేందుకు తాను వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పెన్షన్‌దారుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత కార్మికుల పెన్షన్లు పెంచుతామని, అధికారంలోకి వచ్చిన మరుసటి నెల నుంచే వీటిని అమలు చేస్తామని చెప్పినప్పటికీ, అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దాదాపు 50 లక్షల మంది పింఛన్‌దారుల పొట్టన సీఎం రేవంత్‌రెడ్డి మట్టికొట్టారన్నారు. పింఛన్‌దారుల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం వారిని విస్మరించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా పెన్షన్ల ఊసే లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి నెలనెల జీతాలు తీసుకుంటున్నప్పటికీ, పింఛన్‌దారుల పింఛన్ల పెంపు మాటమరిచారన్నారు. ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపిస్తున్నా సీఎం ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదా, పాలకులు జీతాలు తీసుకోవడం లేదా నిలదీశారు. పెన్షన్‌దారులకు దక్కాల్సిన రూ.20 కోట్లను భూస్వాములకు పంచిపెట్టారని ఆరోపించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

పాపన్నపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మనస్తాపం చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలోని అమ్రియా తండాలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. అమ్రియా తండాకు చెందిన లునావత్ లక్ష్మి(40) భర్త గోపాల్‌తో కలిసి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొన్ని రోజులుగా సంసార విషయంలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన లక్ష్మి గురువారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు వెంటనే గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి లాల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కోమటి చెరువు , దక్షిణ ద్వారం మత్తడి వద్ద గురువారం నీటిలో గుర్తుతెలియని శవం లభ్యమైంది. వన్ టౌన్ సీఐ వాసుదేవ రావు కథనం ప్రకారం.. ఓ వ్యక్తి నీటిలో బోర్ల పడి ఉన్నందున, ముఖ భాగములు పెదవులు, ముక్కు, చెవులు, కండ్లు చేపలు తిని, కుళ్లిపోయి ఉబ్బి ఉంది. ఆ వ్యక్తి వయసు సుమారు 35-40 సంవత్సరాలు వరకు ఉంటుందని, వ్యక్తిపై డార్క్ గ్రే బ్లాక్ నైట్ ట్రాక్ పాంట్, ఆఫ్ హాండ్స్ కాలర్ పాకెట్ కలిగి ఉన్న పర్పుల్ కలర్ టీ -షర్టు ఉందని తెలిపారు. మృతుడి కుడి చేతికి మూడు వరసల జపమాల రాఖీ కట్టి ఉందన్నారు. ఎవరైనా శవంను గుర్తుపట్టిన యెడల, సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్యాస్ లీకై వ్యక్తి మృతి

ఝరాసంగం,ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఝరాసంగం మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలో ఈ నెల 6న గ్యాస్ సిలిండర్ లీకై గాయాలతో చికిత్స పొందుతూ గొర్రెకంటి ప్రభు(38) శుక్రవారం ఉదయం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ప్రభు ఇంట్లో వంటగ్యాస్ లీక్ అవ్వడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజుల క్రితం తల్లి గొర్రెకంటి శంకరమ్మ కూడా ఇదే ఘటనలో మృతిచెందింది. మృతుడికి భార్య, 14నెలల కుమారుడున్నాడు. మృతుడి తండ్రి బక్కన్న ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన క్యాసారంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంగాని అంజనేయులు(46) గురువారం రోజున క్రిమిసంహారక మందు తాగాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ప్రభుత్వ కార్యాలయాల్లో, పార్టీ ఆఫీసుల వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు.


సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎస్పీ పంకజ్



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


నారాయణఖేడ్‌లో జెండా వందనం చేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్


సంగారెడ్డి కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ అనంతరం గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో వందనం చేస్తున్న ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర, తదితరులు


నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాహారతి


మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న అదనపు ఎస్పీ మహేందర్


మెదక్ కలెక్టరేట్‌లో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు

ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులను ఆయా జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు అందజేశారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు, నర్సులు, పలువురు కార్మికులు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

సిద్దిపేట జిల్లా




సిద్దిపేటలో ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ అగ్రవాల్

మెదక్ జిల్లా




మెదక్‌లో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి వివేక్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



సంగారెడ్డి జిల్లా


సంగారెడ్డిలో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి దామోదర్, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



తలకిందులుగా జాతీయ జెండా


టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద తలకిందులుగా ఎగురవేస్తున్న జెండా

చిన్నశంకరంపేట/టేక్మాల్/జోగిపేట రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జాతీయ పతాకాలను తలకిందులుగా ఎగురవేసిన మూడు సంఘటనలు చోటు చేసుకున్నాయి. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా ఆవిష్కరించారు. వెంటనే గమనించి ఉపాధ్యాయులు సరిచేశారు. అదేవిధంగా టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రియాజొద్దీన్ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. అధికారులు, నాయకులు గుర్తించి చెప్పడంతో తిరిగి ఎగురవేయగా మళ్లీ తలకిందులుగానే కనిపించింది. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య భవనం వద్ద అధికారిణి నిఖిత ఎగురవేసిన జెండా ఉదయం సరిగ్గానే ఉన్నప్పటికీ, మధ్యాహ్నం చూసే సరికి తలకిందులుగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు డెయిరీ సిబ్బంది చెప్పారు.

న్యూజిలాండ్‌లో డప్పు కళా ప్రదర్శన


న్యూజిలాండ్‌లో డప్పులతో అందె భాస్కర్ బృందం

మిరుదొడ్డి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు మిరుదొడ్డి మండలానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తన బృందంతో కలిసి శుక్రవారం న్యూజిలాండ్‌లో డప్పు కళా ప్రదర్శన ఇచ్చారు. న్యూజిలాండ్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కళా ప్రదర్శన అనంతరం న్యూజిలాండ్ కౌన్సిల్ జనరల్ డాక్టర్ మధన్ మోహన్‌శెట్టి ఆయనకు జ్ఞాపికను అందజేశారు.

పంద్రాగస్టు ఎరుగని అడ్డా కూలీలు!

పని కోసం పడిగాపులు

మెదక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందడి నెలకొంది. కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. అయితే, ఈ పండుగ వాతావరణం కూలీల బతుకుల్లో మాత్రం కనిపించడం లేదు. రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి కూలీలకు ఈరోజు కూడా మరో సాధారణ పనిదినమే. పండుగ రోజున పని దొరుకుతుందో లేదోనని ఆందోళన చెందుతూ, మెదక్ పట్టణంలోని లేబర్ అడ్డాకు క్యూ కట్టారు.


పంద్రాగస్టున మెదక్‌లోని లేబర్ అడ్డాలో పనుల కోసం కూలీల ఎదురుచూపులు

మెదక్, రామాయంపేట, పాపన్నపేట, చేగుంట, చిన్నశంకరంపేటతో పాటు కామారెడ్డి జిల్లా నుంచి కూడా వందలాది మంది కూలీలు పనుల కోసం నిత్యం మెదక్ లేబర్ అడ్డాకు వస్తుంటారు. సాధారణంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే తరుణంలో కూలీల కొరత ఉంటుంది. కానీ, పంట పెట్టుబడులు, అతివృష్టి, అనావృష్టి వంటి కారణాల వల్ల వ్యవసాయం కంటే కూలీ పనులకు వెళ్లడమే నయమని భావిస్తూ చిన్న, సన్నకారు రైతులు కూడా అడ్డా బాట పడుతున్నారు.

పని లేకుంటే పస్తులు



పండగ అని కూర్చుంటే పొట్ట ఎలా గడుస్తుంది? కారం మెతుకులతో కూడా భోజనం దొరకని పరిస్థితి మాది. పండుగ సంబరాల్లో పాల్గొనాలని ఉన్నా, పని దొరక్కపోతే పస్తులు ఉండాల్సి వస్తుంది.

- వడ్డెర వెంకయ్య, అడ్డా కూలీ

మూడు రోజులే పని



అడ్డా మీద కూలీలు ఎక్కువై, పనికి పోటీ పెరిగింది. వారంలో మూడు రోజులే పని దొరుకుతోంది. మిగతా రోజులు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. వయసు మీద పడుతున్నా, కష్టపడితే తప్ప జీవితం సాగని పరిస్థితి.

- అంజయ్య, అడ్డా కూలీ




తొగుట మండలం వెంకట్రావ్‌పేటలో క్యూ కట్టిన రైతన్నలు, చిన్నశంకరంపేట మండలం మడూర్ సొసైటీ కార్యాలయం వద్ద ఎగబడుతున్న రైతులు

యూరియా కోసం బారులు

మిరుదొడ్డి/తొగుట/చిన్నశంకరంపేట/మనోహరాబాద్/మాసాయిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి, తొగుట, మెదక్ జిల్లా చిన్నశంకరంపేట, మనోహరాబాద్ మండలాల్లోని ఎరువుల దుకాణాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మిరుదొడ్డిలో పీఏసీఎస్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు సముదాయించగా, తొగుటలో ఒక రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాసాయిపేటలోని రైతు ఆగ్రో కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెల్లాపూర్‌లో కొలువైన మీసాల కృష్ణయ్య

నేడు కృష్ణాష్టమి

దుబ్బాక, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో అరుదుగా కనిపించే మీసాల కృష్ణుడు సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో కొలువుదీరి భక్తుల నమ్మకాలకు ప్రతీకగా నిలిచారు. కరువులో వెలిసిన ఈ దేవదేవుడు, నేటికీ ఆ ప్రాంత ప్రజల జటిలమైన వివాదాలను పరిష్కరించే దైవంగా పూజలందుకుంటున్నాడు.


చెల్లాపూర్ ఆలయంలోని మీసాల కృష్ణుడు

కరువులో ఆలయ నిర్మాణం

సుమారు 600 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాన్ని కరువు పట్టి పీడించగా, భూస్వాముల పన్నుల వేధింపుల నుంచి తప్పించుకోవడానికి వారి నుంచే నిధులు సమీకరించి గ్రామస్థులు ఈ ఆలయం నిర్మించారని ప్రతీతి. ఇక్కడి మీసాల కృష్ణుడి సన్నిధిలో అసత్యాలకు తావుండదని స్థానికుల ప్రగాఢ విశ్వాసం. ఎటువంటి వివాదాలు వచ్చినా ఆలయం మెట్లపై ప్రమాణం చేస్తే సత్యం బయటపడుతుందని వారు నమ్ముతారు. అందుకే ఈ ప్రాంత ప్రజలు ఎంతటి జటిలమైన సమస్యలనైనా ఇక్కడే పరిష్కరించుకుంటారు. ఆలయంలో నిరంతరం వెలిగే అఖండ దీపం కూడా స్వామివారి మహిమకు, సత్యానికి నిదర్శనమని భక్తులు నమ్మకం.

మీసాలెలా వచ్చాయంటే..

ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి గ్రామస్థులు సిద్ధమయ్యారు. విగ్రహం దొంగతనం అయ్యిందని రాజగోపాల్‌పేట గ్రామస్థులు వెతుకుతున్నారని తెలిసి, దొరికిపోతామన్న భయంతో శ్రీకృష్ణుడి విగ్రహానికి వెండి మీసాలు అతికించారు. తలపై ఉన్న కొప్పును తీసి కిరీటం పెట్టారు. దీంతో ఈ స్వామి మీసాల కృష్ణుడుగా ప్రసిద్ధి చెందారు.



అబ్బురపరిచిన హరివిల్లు

జహీరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌లోని బాబానగర్ వాసులను హరివిల్లు అబ్బురపరిచింది. శుక్రవారం నల్లని మేఘాల మధ్య ఏర్పడిన ఇంద్రధనుస్సు చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు.

జల పరవళ్లు

పుల్‌కల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద పోటెత్తుతున్నది. శుక్రవారం 11,083 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. 8, 9, 11వ నంబర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. గేట్ల ద్వారా 25,433 క్యూసెక్కులు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని రెండు టర్బైన్ల ద్వారా 2,491 క్యూసెక్కులు వెళ్తున్నాయి. మొత్తం 28,557 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది. సంగారెడ్డి సమీపన ఉన్న మంజీర జలాశయం రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 10,184 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 9,906 క్యూసెక్కులుగా నమోదైంది.


సింగూరు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న జలాలు



సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న పూజల హరికృష్ణ



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు



దుబ్బాకలోని గాంధీ విగ్రహం వద్ద జెండాను ఎగురవేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి



సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ప్రైమరీ హై స్కూల్‌లో పంద్రాగస్టు వేడుకలు



జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో జెండా వందనం



కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో జెండాను ఎగురవేస్తున్న ఈవో అన్నపూర్ణ



తొగుట తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న శ్రీకాంత్



మర్కుక్: అంగడికిష్టాపూర్ పాఠశాలలో వీర జవాన్లకు నివాళులర్పిస్తూ చిన్నారుల ప్రదర్శన

జిల్లాలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



గజ్వేల్ మండలంలోని స్మీత్ పాఠశాలలో చిన్నారులతో ఉపాధ్యాయులు

జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టు ప్రాంగణాలు వివిధ పార్టీల కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, పీహెచ్‌సీలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతీయగీతాన్ని ఆలపిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణతో బ్యాండ్ మేళాల మధ్య నిర్వహించిన ప్రభాతభేరి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలు పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి)



చిన్నకోడూరు ప్రైమరీ స్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకలు



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న కమిషనర్



చేర్యాల తహసీల్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న తహసీల్దారు దిలీప్‌నాయక్, పలు రాజకీయ పార్టీల నాయకులు

మంత్రి పొన్నంను కలిసిన క్రీడాకారులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన క్రీడాకారులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిద్దిపేట జిల్లా కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులు డీవైఎస్‌వో వెంకటనర్సయ్యతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమి మంజూరైన నేపథ్యంలో మంత్రిని కలిసి కబడ్డీ క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వాలీబాల్ జాతీయ జట్టు శిక్షణకు ఎంపికైన పురం హాసినిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం: దుబ్బాక ఎమ్మెల్యే



భూంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

తొగుట/దుబ్బాక/మిరుదొడ్డి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యం అంటే రైతులను రోడ్డు మీదకు తెచ్చి వారి నోట్లో మట్టి కొట్టడమేనా అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘాటుగా ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తొగుట, దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లో ఎరువుల విక్రయకేంద్రాల వద్ద బారులు తీరిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ఎఫ్‌పీసీ కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు తమ సమస్యలను తమ సమస్యలను వెళ్లగక్కారు. ఈ సందర్భంగా రైతులు యూరియా కష్టాల గురించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ప్రభుత్వం వెంటనే ఎరువుల కొరత తీర్చని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని అక్బర్‌పేట చౌరస్తాలో గ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం ఆందోళన చేపట్టారు. గ్రోమోర్ కేంద్రం వద్ద ఉదయం 5గంటల నుంచి రైతులు బారులు తీరినా ఫలితం లేకపోయింది. దీంతో ఆగ్రహానికి గురైన రైతాంగం ఆందోళనకు దిగారు. అదే సమయంలో సమయంలో దుబ్బాకకు వస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి వారితో పాటే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతవల్లే యూరియా కొరత ఏర్పడిందని మండిపడ్డారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం



మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రిటైర్డు ఉద్యోగులు

హుస్నాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పట్టణానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయులు మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ బూర వెంకన్నలు సతీష్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వంగ వెంకట్రాంరెడ్డి, బీలునాయక్, నాయకులు తదితరులున్నారు.

నేటి రైతు ధర్నాను జయప్రదం చేయండి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

గజ్వేల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 తలపెట్టిన రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని బూర్గుపల్లి చౌరస్తా వద్ద రైతు ధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు రైతులు, పార్టీలకు అతీతంగా నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఊడెం కృష్ణారెడ్డి, ఖాజా విరాసత్‌అలీ, నవాజ్‌మీరా, పంగ మల్లేశం, మధు, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్, కనకయ్య, నరేందర్, రహీం, స్వామిచారీ తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చేర్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పదవీకాలం గడువు పెంపొందిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వెలిబుచ్చుతూ శుక్రవారం చేర్యాల సొసైటీ కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు తాళ్లపల్లి నర్సయ్య, వెలుగల శ్రీనివాస్, పర్పాటకం మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు వితరణ

కొండపాక,ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి):శ్రీ రామదాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గడీల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కొండపాక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంబటి నరసింహులు , మంతూరీ అశోక్ ల సహకారంతో రూ.10వేల విలువైన ప్లేట్లను 120 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని బందారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టై , బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, లక్షపతి, రవీందర్ రెడ్డి ,పాఠశాల ప్రదానోపాధ్యాయులు రామచంద్రం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

మర్కుక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జగదేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన రామిండ్ల రాధిక(35) రాజు దంపతులకు పదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు రాధిక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

మల్లన్న ఆలయం మాజీ చైర్మన్‌కు సతీవియోగం



సులోచన (ఫైల్)

చేర్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత ముస్త్యాల కిష్టయ్య సతీవియోగంతో కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన భార్య సులోచన (53)అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, నాయకులు తదితరులు కిష్టయ్యను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

వేచరేణిలో వాటర్ ప్లాంటు ప్రారంభం

చేర్యాల, ఆగస్టు 15(ఆంధ్ర జ్యోతి): చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. చాన్నాళ్లక్రితం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ నెలకొల్పినప్పటికీ పరికరాలు పాడైపోయాయి. వాటిని తొలగించి నూతన సాంకేతికతతో కూడిన యంత్రాలను ఇటీవల బిగించారు. స్మార్ట్ కార్డ్ ఆధారంగా నీటిని వినియోగించుకునే సౌకర్యం కల్పించారు. మాజీ సర్పంచు ఏనుగుల దుర్గయ్య, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, నాయకులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

అంగడికిష్టాపూర్ ఆదర్శం

మర్కుక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో శుక్రూరం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఎమ్మెల్సీ నిధుల నుంచి గ్రామ పంచాయతీ కూడలి వద్ద ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గజ్వేల్ బీఆర్ ఎస్ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీరాములుగౌడ్‌తో కలిసి ప్రారంభించారు.

మండల కార్ యూనియన్ కమిటీ ఎన్నిక

కోహెడ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండల కారు యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జాగిరి ప్రశాంత్, పెసర సుధాకర్, నేరెళ్ల సదానందం, ప్రధాన కార్యదర్శిగా బండ రాజశేఖర్, కోశాధికారిగా గద్దెల రమేష్, గౌరవ అధ్యక్షులుగా బొమ్మగాని శివకుమార్, తిప్పారపు నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా గుగ్గిళ్ల కపిల్ ,బండారి రవి, పైడి రమేష్, ఉప్పరపెల్లి సంపత్, కంకణాల సాయినాథ్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

పద్మశాలీ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడిగా సాయికిరణ్

మిరుదొడ్డి, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా ఖాజీపూర్ గ్రామానికి దిడ్డి సాయికుమార్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా భూమేష్, ప్రధానకార్యదర్శిగా కిషన్, కోశాధికారిగా నవీన్, సహాయకార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నర్సింలు, కరుణాకర్, నవీన్, నగేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దళిత వ్యతిరేకి నర్సారెడ్డిని అరెస్టు చేయాలి



సిద్దిపేటలో డీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎస్సీ సెల్, దళిత సంఘాల నాయకులు

సిద్దిపేట ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము విజయకుమార్‌ను కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని దళిత మహిళా సంఘం, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్ల యేసు, నాయకులు నరహరి డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలోని డీసీసీ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండా ఎగరవేయడానికి వచ్చిన డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి సొంత పార్టీ నుంచే నిరసన సెగలు ఎదురయ్యాయి. సిద్దిపేటకు వచ్చిన నర్సారెడ్డి కారును కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు, మహిళలు, దళిత ప్రజా సంఘాల నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, నర్సారెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. ఈ మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నర్సారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నినాదాలతో హోరెత్తించారు. అనంతరం నర్సారెడ్డి చిత్రపటం ఫ్లెక్సీని దహనం చేసి రాస్తారోకో నిర్వహించగా పోలీసులు సూచన మేరకు విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత వ్యతిరేకి నర్సారెడ్డిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నర్సారెడ్డిపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోకపోతే, సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి దళితులు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బెట ఆనంద్, నాయకులు రాజేష్, పుట్ల ప్రసాద్, భాను, లక్ష్మి, కనకవ్వ, మమత, సంధ్య, అంజలి, యాదవ్వ ప్రమీల, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



పొన్నాలలోని వికాస్ హైస్కూల్లో ఉట్టికొడుతున్న చిన్నారులు



కొండపాక: వేద స్కూల్‌లో కృష్ణ గోపికల వేషధారణలో విద్యార్థులు

సిద్దిపేట అర్బన్/కొండపాక, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని వికాస్ హైస్కూల్‌లో చిన్నారులు గోపిక, చిన్ని కృష్ణుల వేషాధారణతో అలరించారు. చిన్నారులతో ఉట్టి కొట్టించి సంబరాలను నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. కొండపాకలోని వేద ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు గోపికమ్మ వేషధారణలతో శ్రీకృష్ణ వేషాధారణలతో ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

పెద్దమ్మ తల్లికి మంగళహారతులు



మంగళహారతులు సమర్పిస్తున్న ముదిరాజ్ సంఘం మహిళలు

చిన్నకోడూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని చిన్నకోడూరులో పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు మంగళహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



మల్లుపల్లిలో ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మిరుదొడ్డి,ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపల్లి గ్రామంలో నెలరోజులుగా భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో శుక్రవారం గ్రామ మహిళలు ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మునిసిపల్ కార్యాలయంలో చిందులు



కార్యాలయ ఆవరణలో డ్యాన్స్ చేస్తున్న మేనేజర్ ప్రభాకర్

చేర్యాల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ సిద్దిపేట జిల్లా చేర్యాల మునిసిపల్ కార్యాలయ ఆవరణలో మేనేజర్ ప్రభాకర్, పలువురు వార్డు ఆఫీసర్లు, సిబ్బంది సినిమా పాటలకు చిందేయడం వివాదాస్పదమైంది. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ముగించిన తరువాత కమిషనర్ నాగేందర్ కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. సిబ్బందిలో ఒకరి జన్మదినం కావడంతో కేక్ కట్ చేసిన అనంతరం కార్యాలయ ఆవరణలో మేనేజర్ ప్రభాకర్, పలువురు మహిళా వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది కలిసి ముందస్తుగా తెలంగాణ, జానపద పాటలతో డ్యాన్స్ చేశారు. ఆదర్శవంతమైన హోదాలో ఉన్నామన్న విచక్షణ మరిచిన మేనేజర్ ప్రభాకర్ జోష్‌లో సినీపాటలతో చిందేశారు. ఊ అంటావా.. మావా.. ఊహూ అంటావా.., చిలుకలూరి చింతామణి.. బ్లాక్ బస్టరే.. వంటి ఆట, పాటలతో స్టెప్పులేశారు. దేశభక్తితో మెదలెట్టాల్సింది పోయి ఇష్టానుసారం వ్యవహరించడం కలకలం రేపింది. ఓ వైపు కలెక్టర్ నిత్యం ఏదో ఓ మండలంలో ఆకస్మిక పర్యటన చేస్తూ క్రమశిక్షణ చర్యలు చేపడుతుండగా, మునిసిపల్ కార్యాలయాధికారులు, సిబ్బంది తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించిన విషయం సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వేడుకలకు ప్రత్యేకాధికారి గైర్హాజరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

సిద్దిపేట రూరల్,ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండల ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మండల కేంద్రంలో జరిగిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గైర్హాజరు కావడం పట్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు అగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి స్థానంలో ఎంపీడీవో జాతీయ జెండాను అవిష్కరించారు. గత నెల రోజులుగా నారాయణరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డీఈవోను కలిసేందుకు వేచి చూడగా వేడుకలకు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి వచ్చినప్పుడు కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు కుడా అవకాశం కల్పిండం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. కాగా కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలకు హాజరైనందున మండల కేంద్రానికి ప్రత్యేకాధికారి రాలేకపోయారని ఎంపీడీవో వివరించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన పాక్స్ చైర్మన్



మర్కుక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత తనయుడు ఉన్నత చదువుల కొరకు అమెరికా వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఆమె తన తండ్రి కేసీఆర్ ఆశీస్సులు తీసుకోవడానికి కొడుకుతో కలిసి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ప్యాక్స్ వైస్‌చైర్మన్ బాలరాజు కవితను మర్యాదపూర్వకంగా కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్షేమంగా వెళ్లి రావాలని ఆకాంక్షించారు.

ఐదు సీజన్లలో రూ.29.27కోట్ల బకాయి

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరాల శాఖ కమిషన్ చెల్లిస్తుంది. ఐదు సీజన్లలో కొన్న ధాన్యానికి గాను ఆయా సంఘాలకు రూ. 29.27 కోట్ల కమిషన్ రావాల్సి ఉంది. ఐదు సీజన్లు గడిచినా సహకార, మహిళా సంఘాలకు కమిషన్లు బకాయి పెట్టడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కమిషన్‌ను విడుదల చేసి సంఘాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించాలని ఆయా సంఘాలు కోరుతున్నాయి. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల డీఎం ప్రవీణ్ కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ధాన్యం కొనుగోలు కమిషన్ నిధులు విడుదల కాగానే వారికి అందజేస్తామని తెలిపారు.